# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- విద్యార్థుల భవిష్యత్ విషయంలో ఉపాధ్యాయులతో పాటు, తల్లిదండ్రుల బాధ్యత కూడా చాలా కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ఈరోజు శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటించి స్థానిక వ్యవసాయ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు.
- విశ్వవిద్యాలయాలు విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తీర్చిదిద్దుతాయని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణకు ప్రభుత్వం కృషి చేస్తోందని హోం మంత్రి వంగల పూడి అనిత తెలిపారు.

============================

విద్యను అందించి జ్ఞానాన్ని ప్రసాదించే పాఠశాలలను రక్షించుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కొత్త చెరువు మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో తల్లిదండ్రులలు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్)లో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... గురుపౌర్ణమి రోజున ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయుడిని ఆరాధించటం మన సాంప్రదాయమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ విషయంలో ఉపాధ్యాయులతో పాటు, తల్లిదండ్రుల బాధ్యత కూడా చాలా కీలకమన్నారు. విద్యార్థుల హాజరును తల్లిదండ్రులు తెలుసుకునేందుకు కొత్తగా యాప్ తీసుకొచ్చామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

అలాగే విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యా శాఖ ద్వారా “ఏక్ పేడ్ మాకే నామ్” కార్యక్రమం కింద కోటి మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతకు శ్రీకారం చుట్టామని మంత్రి లోకేష్ వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

============================

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ఈరోజు పర్యటించారు. ఆయన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చంనాయుడుతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించి జిల్లాలోని వ్యవసాయ పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం శివరాజ్ సింగ్ చౌహన్ మాట్లాడుతూ... గ్రామీణ అభివృద్ధి భూ వనరుల శాఖలు సంయుక్తంగా పనిచేస్తూ.. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో పంటలు పండించడానికి, వర్షపు నీటి సంరక్షణకు కృషి చేస్తున్నాయన్నారు. జలవనరుల శాఖతో కలిసి తుంగభద్ర, కృష్ణా నదుల నుండి నీటిని ఇక్కడికి ఎలా తీసుకురావాలో ప్రయత్నిస్తామని తెలిపారు. అదేవిధంగా సమీకృత వ్యవసాయం, పశుసంపద అభివృద్ధిపై కూడా దృష్టి పెడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఇటువంటి అనేక అంశాలపై సమగ్ర అభివృద్ధి కోసం పని చేస్తామని శివరాజ్ సింగ్ చౌహన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

============================

విశ్వవిద్యాలయాలు విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా  తీర్చుదిద్దుతాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వెంకట రామన్నగూడెంలోని డాక్టర్ వై.ఎస్.ఆర్ ఉద్యానవన విశ్వవిద్యాలయం 6వ స్నాతకోత్సవాన్ని ఈరోజు కృష్ణాజిల్లా ఆత్కూర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ ప్రసంగిస్తూ....

(వాయిస్ 29 సెకన్లు)

============================

రాష్ట్రంలో మామిడి రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తగు సహాయం అందించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. ఈరోజు గురు పౌర్ణమి సందర్భంగా పుట్టపర్తిలోని  ప్రశాంతి నిలయంలో జరిగిన వేడుకల్లో కేంద్రమంత్రి పాల్గొన్నారు. “మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్” కార్యక్రమాన్ని ముగించుకున్న అనంతరం మధ్యాహ్నం ముఖ్యమంత్రి కూడా ప్రశాంతి నిలయానికి వెళ్లి మహా సమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న కేంద్రమంత్రితో సమావేశమై రాష్ట్రంలో మామిడి, ఇతర పంటలకు సంబంధించిన సమస్యలపై చర్చించారు.

విరామం

============================

రాష్ట్ర వ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణకు ప్రభుత్వం కృషి చేస్తోందని హోం శాఖ మంత్రి వంగల పూడి అనిత అన్నారు. ఈరోజు అనకాపల్లి జిల్లా నక్కపల్లి సర్కిల్ పోలీసు స్టేషన్ లో జరిగిన కార్యక్రమంలో హోం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాయకరావుపేట తాండవ జంక్షన్ నుండి ఎస్.రాయవరం, ధర్మవరం వరకు 100 సీసీ కెమెరాలతో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కంట్రోల్ రూమ్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... రాష్ట్రంలో సీసీ టీవీ వ్యవస్థను ఏర్పాటు చేసి సాంకేతికతను వినియోగించడంతో నేరాల రేటు తగ్గిందని, పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా పోలీసు వ్యవస్థ పని చేస్తోందన్నారు. యువత సామాజిక మాధ్యమాలను సరైన మార్గంలో ఉపయోగించుకోవాలని, మత్తుపదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోకూడదని హోం మంత్రి సూచించారు.

============================

అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతుల నుండి వచ్చిన ప్రతి ధరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిశీలన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ పథకంపై అధికారులతో కలెక్టర్ శ్రవణ మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగా ఈ నెల 17వ తేదీన రైతులకు “అన్నదాత సుఖీభవ పథకం” కింద నగదు జమ చేయనుందని ఆయన తెలిపారు. అర్హత కలిగిన ప్రతి రైతు ఈ పథకం పొందేందుకు వీలుగా పెండింగ్‌లో ఉన్న రైతుల వివరాలను పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

==============================

మధ్య వర్తిత్వంతో అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని విజయనగరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎం.బబిత జ్యోతి అన్నారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ న్యూఢిల్లీ ఆదేశాల మేరకు ఈరోజు స్థానిక జిల్లా న్యాయస్థానంలో మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులకు ఒకరోజు కార్యశాలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బబిత జ్యోతి మాట్లాడుతూ... శిక్షణ పొందిన న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కల్పించి  మరింత చేరువచేయాలన్నారు. మధ్యవర్తిత్వం ప్రక్రియ చాలా సులువైనదని, ఖర్చు లేనిదని ప్రజలకు తెలియజేయాలన్నారు.

==============================

ఆషాఢ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని విశాఖ జిల్లా సింహాచలం క్షేత్రంలో కొలువైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారికి చివరి విడత చందనాన్ని అర్చకులు సాంప్రదాయ బద్ధంగా సమర్పించారు. గిరి ప్రదక్షణ పూర్తి చేసుకొని వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కాగా నిన్న మొదలైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం ఈ రోజుతో ముగిసింది. గిరి ప్రదక్షిణ విజయవంతం చేయడంలో భాగస్వాములైన అధికారులు, సిబ్బందికి ఆలయ కార్యనిర్వహణ అధికారి వేండ్ర త్రినాధరావు ధన్యవాదాలు తెలిపారు.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 83,536 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై...  చివరికి 346 పాయింట్ల నష్టంతో 83,190 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 120 పాయింట్ల నష్టంతో 25,355 వద్ద ముగిసింది.

==============================

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడవ టెస్ట్ మ్యాచ్ ఇంగ్లాండ్ లండన్ లోని లార్డ్స్ వేదికగా కొద్ది సేపటి క్రితం ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ లంచ్ విరామ సమయానికి  2 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది.

==============================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమదిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో రానున్న రెండు రోజులకు సంబంధించిన వర్ష సూచనలను వాతావరణ శాఖాధికారిణి లక్ష్మీ వెల్లడిస్తూ....

(వాయిస్ 27 సెకన్లు)

==============================

==============================